# సంధ్యాసమయం

గంగరాజు, లింగరాజు, గవ్రరాజు, సత్తిరాజు, పీర్రాజు, సర్రాజు అంటూ సహస్రనామం పారాయణచేస్తూ రాజారావును లేపేను ఒళ్ళువిరుచుకుని "అప్పుడే తెల్లారిపోయిందా?'' అంటూ లేచాడు "తెల్లారడం కాదు బ్రదర్! చీకటిపడింది. ఇవాళ ఆదివార మగుటంజేసి మధ్యాన్నం బజ్జున్నావు" అని నేను జ్ఞాపకం చేయగానే మనసారా మరోసారి ఆవలించి లేచి, మంచంమీదే కూర్చుని, మధ్యాన్నం తాలూకు దుఃఖాన్ని పునఃస్మరణ మొదలెట్టేడు.

''ఇంక నేను యీ జీవితం గడపలేను'' అన్నాడు రాజు.

''దేహం చాలిస్తావా?''

''బలవంతం లేదు.''

''హోటలు ప్రొప్రయిటర్ని చంపేస్తాను.''

''ఈశ్వరేచ్ఛ ''

''వీధిలో పారేస్తే ఆ అన్నాన్ని కుక్కలు కూడా ముట్టుకోటం లేదు. వెధవ భోజనం వాడూను. ఆనపకాయ కూరా, ఆనపకాయ పులుసూ, ఆనప కాయ పచ్చడి! హుం! ఈ బాధ భరించలేను! నా తరంకాదు! నా తరంకాదు!" అంటూ మళ్ళీ మూర్ఛపోయాడు.

మళ్ళీ యింత హఠాత్తుగా మూర్ఛపోవటానికి కారణమేమిటంటే-యిక్కడ వీడు స్పృహాచ్చి కన్నీరు మున్నీరుగా విలపిస్తుంటే, అదే సమయంలో వెనకింటి కామేశ్వరమ్మగారు కొంప మునిగిపోయినట్టు పోపు గరిట చుంయ్ మనిపించింది. ఆ పరిమళం విషవాయువులాగ పనిచేసిన సందర్భంలో రాజుకి మళ్ళీ ప్రాణంమీద కొచ్చింది.

సంజీవిలాంటి రెండు సిగరెట్ దమ్ములు లాగినతర్వాతకానీ రాజు మళ్ళీ తేరుకోలేదు. రాజు మా పినతండ్రి కొడుకు. మా పూళ్ళో యింటిపట్టునే

